క్లుప్తంగా

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

భామిని: మండలంలో పారా లీగల్ వలంటీర్ల నియామకానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండల న్యాయ సేవా సంఘం, కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి(ఇన్‌చార్జి) ఎస్.మణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా సేవాభావంతో పని చేయడానికి ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాజకీయ ప్రమేయం లేకుండా, ఉద్యోగ విరమణ చేసిన వారు, వయోవృద్ధులు, న్యాయ సంబంధిత విద్యార్థులు, మైత్రి సంఘ సభ్యులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు తదితరులు అర్హులని పేర్కొన్నారు.

ఉత్సవాలకు ఎమ్మెల్యే కళావతికి ఆహ్వానం


ఎమ్మెల్యే కళావతికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

వీరఘట్టం: పాతపట్నం నీలమణి దుర్గ ఉత్సవాలు ఈ నెల 21 నుంచి 30 వరకు జరగనున్న నేపథ్యంలో పాల్గొనాలని కోరుతూ ఉత్సవ కమిటీ సభ్యులు పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మరకత లింగేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో దర్శనమిస్తున్న మరకత లింగేశ్వరుడు

పాలకొండ రూరల్: స్థానిక నక్కలపేటలో కొలువుతీరిన మరకత లింగేశ్వరునికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. వైశాఖ అమావాస్యను పురస్కరించుకుని స్వామివారికి విశేష ఆలంకరణలు చేపట్టారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని లింగేశ్వరుని పూజల్లో నిమగ్నమయ్యారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

నవధాన్యాల కిట్ల పంపిణీ


నవధాన్యాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కూర్మారావు

సీతంపేట: మండలంలోని కుశిమి ఆర్‌బీకేలో శుక్రవారం రైతులకు సర్పంచ్ సవర కూర్మారావు ఆధ్వర్యంలో నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటి సాగు వలన నేల సారవంతమౌతుందన్నారు. దిగుబడులు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ గాయిత్రి నాయుడు, మండల యాంకర్ బిడ్డిక నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి

గుమ్మలక్ష్మీపురం: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ డిమాండ్ చేశారు. మహిళ రెజ్లర్లకు మద్దతుగా గుమ్మలక్ష్మీపురం ఎల్విన్‌పేట ప్రధాన రహదారిలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ 39 కేసుల్లో నిందితుడుగా ఉన్న బీజేపీ ఎంపీ భూషణ్‌ను తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. బిడ్డిక అడిత్య, భీమారావు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

కురుపాం: అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ అన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల సమీపంలో పెట్రోల్ బంకు మంజూరు కాగా అక్కడ శ్మశాన వాటికి ఉండటంతో మంతినివలసకు చెందిన గిరిజనులు అభ్యంతరం తెలుపగా శుక్రవారం గిరిజనులతో కురుపాం తహసీల్దార్ రమేష్‌కుమార్, సీఐ సత్యనారాయణ మాట్లాడి పనులు అడ్డుకోవడం సరికాదని సూచించారు. శ్మశాన వాటికకు సరిపడ స్థలం రెవెన్యూ అధికారులు అప్పగిస్తారని గిరిజనులకు తెలిపారు. ఎస్ఐ షణ్ముఖరావు, ఆర్ఐ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కేసు నమోదు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ చింతలపాడు గ్రామానికి చెందిన నిమ్మక లక్ష్మణరావుపై ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... లక్ష్మణరావు తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని గ్రామానికి చెందిన ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షణ్ముఖరావు తెలిపారు.



● కమ్మేసిన మేఘాలు

వీరఘట్టాన్ని శుక్రవారం సాయంత్రం మేఘాలు కమ్మేశాయి. ఊరంతా దుప్పటి పరచినట్టు ఆకాశాన మేఘాలు చుట్టుముట్టాయి. చూపరులకు కాసేపు కనువిందు చేశాయి. సాక్షి కెమెరాకు ఇలా ఆ చిత్రం చిక్కింది. యువత తమ సెల్‌ఫోన్లలో మేఘాలను బంధించారు. – వీరఘట్టం

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం


శివకుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రాష్ట్రంలో అమలవుతున్న వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వీరఘట్టం మండలానికి సంబంధించి సేవా వజ్ర అవార్డు సొంతం చేసుకున్న వండవ గ్రామానికి చెందిన ఉకలాపు శివ కుమార్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కళావతి ఘనంగా సత్కరించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వలంటీర్లు వారధుల్లా ఉన్నారని, వీరి సేవలు నిరుపమానమన్నారు. వీరఘట్టం మండలంలో మొత్తం 379 మందిలో ఒకరు సేవా వజ్ర, 5గురు సేవా రత్న, 373 మంది సేవా మిత్ర అవార్డులు సొంతం చేసుకున్నట్లు ఎంపీడీఓ వై.వెంకటరమణ తెలిపారు. అవార్డు పొందిన వారికి ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వండవ సర్పంచ్ మిడితాన కల్యాణి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి తదితరులు అభినందించారు.

జీసీసీ రేషన్ డిపోలు సక్రమంగా తెరవాలి


మాట్లాడుతున్న డీఎం సంధ్యారాణి

సీతంపేట: గిరిజన సహకార సంస్థ (జీసీసీ)రేషన్ డిపోలు సక్రమంగా తెరవాలని డివిజనల్ మేనేజర్ జి.సంధ్యారాణి అన్నారు. స్థానిక జీసీసీ బ్రాంచ్ కార్యాలయంలో డివిజన్ స్థాయిలో సేల్స్‌మెన్లు, డీలర్లతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ డిపోలు తెరిచే సమయం బోర్డు పెట్టాలన్నారు. కొంతమంది సేల్స్‌మన్ల పనితీరు సంతృప్తికరంగా లేదన్నారు. అన్ని రకాల నిత్యావసర సరుకులను డిపోల్లో విక్రయించాలన్నారు. ఈ విషయమై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లక్ష్యాలు, యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. కార్యక్రమంలో సీతంపేట, పాతపట్నం జీసీసీ బ్రాంచ్ మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడేగా పాటించాలి


పారిశుద్ధ్య కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్న గ్రామ కార్యదర్శి, సిబ్బంది

సీతంపేట: ఫ్రైడేను డ్రై డేగా పాటించాలని గ్రామ కార్యదర్శి సుదర్శనరావు అన్నారు. సీతంపేటలో శుక్రవారం ప్రధాన రహదారి పక్క కాలువలు, వీధుల్లో పారిశుద్ధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా ప్రజలను చైతన్యం చేశారు. వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రహదారికి ఇరువైపుల ఎటువంటి వాహనాలు పార్కింగ్ చేయవద్దన్నారు. షాపుల యజమానులు చెత్తచెదారాలు రహదారిపై పడేయకుండా డస్ట్‌బిన్లో వేయాలని సూచించారు.

ఘనంగా 'పుచ్చలపల్లి' వర్ధంతి


కురుపాం: పుచ్చలపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


జియ్యమ్మవలస: సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఎం నాయకులు


గుమ్మలక్ష్మీపురం: సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

కురుపాం: మండల కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మండంగి శ్రీనివాసరావు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుచ్చలపల్లి దోపిడికి వ్యతిరేకంగా పోరాటం చేశారని పీడిత ప్రజానీకం తరపున నిలబడ్డారని వ్యవసాయ కూలీల సమస్యలపై పోరాటాలు చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తిరుపతిరావు, రామారావు, యూటీఎఫ్ మండల కార్యదర్శి టి.శ్రీరాములు పాల్గొన్నారు.

జియ్యమ్మవలసలో...

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ సుందరయ్య తన జీవితాంతం దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేశారని, పీడిత ప్రజానీకం తరపున పోరాడారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కె.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: సమాజ మార్పు కోసం ఎంతో కృషి చేసిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు మండంగి రమణ, కె.గౌరీశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద కామ్రేడ్ సుందరయ్య వర్ధంతి సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిడ్డిక సత్యం, శంకరరావు, మండంగి సన్యాసిరావు, పువ్వల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో అస్తవ్యస్తం

పాలకొండ రూరల్: పట్టణంలో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులతో జనజీవనం కాసేపు స్తంభించింది. గాలులు తీవ్రంగా వీయడంతో పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్, ఆంజనేయస్వామి గుడి సమీపంలో హోర్డింగ్‌లు, శ్రీకాకుళం, సీతంపేట, వీరఘట్టం రహదారుల్లో, రెల్లివీధిలో చెట్ల కొమ్మలు నేలకొరిగాయి. గాలుల తీవ్రతకు మామిడి పండ్లు నేలరాలాయి. తీవ్రంగా నష్టపోయామని మామిడి రైతులు, తోటల కాపలాదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

వలంటీర్లకు సన్మానం


గ్రామ వలంటీర్‌కు సన్మానిస్తున్న ఎంపీడీఓ సత్యం తదితరులు

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో గ్రామ వలంటీర్లకు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ కొండపల్లి సత్యం ఆధ్వర్యంలో చిన్నబగ్గ, మర్రిపాడు గ్రామ సచివాలయాల పరిధిలో 25 మందికి సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీ గిరిజన గురుకుల పాఠశాల (పీటీజీ బాలికలు)లో 3వ తరగతిలో మరియు 4, 7వ తరగతులలో మిగులు సీట్లను భర్తీ చేసేందుకు విద్యార్థినిల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కమలకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు 3వ తరగతిలో పీటీజీ – ఎస్టీకు 75 సీట్లు, ఎస్సీకు 2 సీట్లు, బీసీలకు 1, ఓసీలకు 1 ఏఈక్యూకు 1 చొప్పున్న సీట్లు భర్తీ చేపట్టనున్నట్లు చెప్పారు. 4వ తరగతిలో పీటీజీ –ఎస్టీకి 3 సీట్లు, 7వ తరతిలో పీటీజీ – ఎస్టీకి 2 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2022 – 23 విద్యాసంవత్సరంలో 2వ తరగతి చదివి ఉంటూ, తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించి ఉండని వారు అర్హులన్నారు. తమ పాఠశాలలో చేరేందుకు ఆసక్తి కనపరిచే విద్యార్థినిలు జూన్ 5వ తేదీలోగా దరఖాస్తులను తమ పాఠశాలకు వచ్చి సమర్పించడంతో పాటు పేర్లను నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

ఎంపికైన 'అంగన్‌వాడీ'లు వీరే..

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో గురువారం ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాటి ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్టు సీడీపీఓ పి.రంగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. నేరడి జయంతి(ఆడలి), పాలక సునీత(మొగదార), సవర సునేమి (ఓంద్రుజోల), సవర సుజాత(మండ), నిమ్మక దివ్య(అడ్డాకులగూడ), సవర సలోమి(ఈతమానుగూడ)లు ఎంపికైనట్టు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై తస్మాత్...

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డా.టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని చినగుడబ, పెదగుడబ, ఎస్సార్‌పేట తదితర గ్రామాలలో సందర్శించి డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. కాలువలలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. కాలువలలో దోమల మందులను పిచికారీ చేయాలన్నారు. గ్రామాలలో మందుల అందుబాటులో ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. పరిశీలనలో డీపీహెచ్ఎన్ఓ ఉషారాణి, సిబ్బంది, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


ఎగువ తాడికొండలో ఆర్చరీ క్రీడలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

ఆర్చరీ క్రీడా శిబిరానికి స్పందన

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ పంచాయతీ ఎగువ తాడికొండ గ్రామంలో ప్రారంభించిన వేసవి ఆర్చరీ క్రీడా శిక్షణ శిబిరానికి విద్యార్థులు(క్రీడాకారులు) నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఆర్చరీ క్రీడ పట్ల పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. వీరికి కోచ్ టి.మల్లేశ్వరరావు ఆర్చరీలో శిక్షణ అందిస్తున్నారు. శిబిరాన్ని శుక్రవారం పరిశీలించిన సర్పంచ్ మండంగి జగ్గారావు మాట్లాడుతూ ఉన్నత స్థాయి ఆర్చరీ క్రీడల్లో గిరిజన విద్యార్థులు రాణించేలా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్


పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

పాలకొండ: నగర పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని పలు వీధుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్బందికి పారిశుద్ధ్య నిర్వహణపై సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 10 రోజుల పాటు పలు కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. రెడ్యూస్ – రీసైకిల్ – రీ యూజ్ నినాదంతో షాపును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వార్డుల వారీగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులను నియమించి కాలువలను శుభ్రం చేస్తున్నామని తెలిపారు.

ఉద్యాన నర్సరీని పరిశీలించిన పీఓ


నర్సరీని పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానికంగా తురాయిపువలస వద్ద ఉన్న హెచ్ఎన్‌టీసీ నర్సరీ యూనిట్‌ను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మొక్కలు ఏఏ రకాలు ఉన్నాయనేది చూశారు. ఎలా అంటుకడుతున్నారనేది పరిశీలించారు. వాణిజ్యపరమైన మొక్కలు పెంచితే బాగుంటుందని, ఈ దిశగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. నర్సరీని అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కుండంగి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే డెంగీ నుంచి రక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పాలకొండ రూరల్: క్షేత్ర స్థాయిలో డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించటం ద్వారా ఈ మహమ్మారి నుండి రక్షణ పొందవచ్చని అన్నవరం, ఎం.సింగుపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు కడియం చిరంజీవి, కల్‌నాథ్ అన్నారు. ఎంపీడీఓ డి.త్రినాధులతో కలసి మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయాల సిబ్బంది, సెక్రటరీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో శుక్రవారం సమీక్షించారు. డెంగీ, సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ప్రస్తుత సీజన్‌లో పల్లెల్లో నమోదవుతున్న ఆరోగ్యపరమైన సమస్యలు, వాటిని అధిమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం సమకూరుస్తున్న మందులు, వాటి వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ముఖ్యంగా దోమల నివారణపై విస్తృత ప్రచారం చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత కల్పించాలన్నారు.

సబ్‌జైలు వద్ద చలివేంద్రం ఏర్పాటు


సబ్‌జైలు వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చలివేంద్రం

పాలకొండ రూరల్: ప్రస్తుత వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో సహకరిస్తాయని పాలకొండ సబ్‌జైలు సూపరింటెండెంట్ బి.జోగులు అన్నారు. సబ్‌జైలు వద్ద ప్రత్యేక చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వివిధ పనులపై వచ్చే వారు ఈ చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వేసవి దృష్ట్యా పలు కూడళ్ల వద్ద చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, యువత, ప్రజలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జైలు హెడ్ వార్డర్ పి.చంద్రరావు, సిబ్బంది పి.మధు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో మేలు



మాట్లాడుతున్న ఏడీపీఎం ధనుంజయరావు

భామిని: నవధాన్యాల సాగుతో పంట పొలాలకు మేలు జరుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా ప్రకృతి వ్యవసాయం అదనపు డీపీఎం ధనుంజయరావు అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీటి సాగులో భూ సారవంతం పెరిగి సూక్ష్మజీవులు వృద్ధి చెంది నేలకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు అందుతాయన్నారు. దీన్ని గుర్తించి నవధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. ఆర్‌బీకేల్లో నవధాన్యాల కిట్లు సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో మండల ఇన్‌చార్జి డి.శివప్రసాద్, మాస్టర్ ట్రైనర్ మోటక అంబోజీ, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలుకు సిద్ధం


బాలేరులో మొక్కజొన్న గింజలు పరిశీలిస్తున్న సొసైటీ అధికారులు

భామిని: మండలంలోని మొక్కజొన్న పంటను పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోలు చేయనున్నట్టు భామిని సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణారావు తెలిపారు. బాలేరు, సొలికిరి గ్రామాల్లో రైతులు ఆరబోసిన మొక్కజొన్న పంటలను శుక్రవారం పరిశీలించారు. జొన్న పండించిన రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేపట్టామన్నారు. క్వింటా రూ.1960లు మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఆర్‌బీకేల్లో పంట నమోదు చేసుకొన్న రైతుల వారీగా ఈకేవైసీ చేసిన పంటను వ్యవసాయ సహాయకులు ఆధ్వర్యంలో పరిశీలిస్తున్నామని తెలిపారు. భామిని సొసైటీ పరిధిలో ఆర్‌బీకేల్లో గుర్తించిన 234 మంది రైతుల పంట కొనుగోలుకు ఐదు వేల గోనె సంచులు సిద్ధం చేశామన్నారు. వారి వెంట వ్యవసాయ సహాయకురాలు జ్యోతి, రైతుమిత్ర తిరుపతి, రైతులు, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

సగటు వేతనం కచ్చితంగా రావాల్సిందే...


కొండాపురంలో ఉపాధి పనుల తీరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్:

ఉపాధి వేతనదారులకు సగటు వేతనం రూ.275 వచ్చేలా మస్తర్లు వేయడం, వారితో ఆ విధంగా పనులు చేయించడంపై క్షేత్ర సహాయకులు దృష్టి పెట్టాలని ఎంపీడీఓ డొండ త్రినాధులు అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలో సాగునీటి బట్టిలో వేతనదారులు చేపడుతున్న పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. హాజరైన వేతనదారులు, వారికి సగటున అందుతున్న కూలీపై ఆరా తీశారు. పనులు జరుగుతున్న చోట కచ్చితంగా ప్రథమ చికిత్స కిట్లు, వడదెబ్బ నుండి తక్షణ రక్షణ కల్పించే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎండల తీవ్రతకు అనుగుణంగావృద్ధులకు, ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడు తున్న వారిని గుర్తించి తాత్కాలికంగా వారికి పనులు కల్పించవద్దన్నారు. ఎండలో పనులు చేయటం వలన కలిగే ఇబ్బందులపై వారికి అవగాహన కల్పించాలన్నారు.